ఏలూరు ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 40.0 కనిష్ఠం : 27.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

1

ఆదివారం 4 మే 2025

ఉమ్మడి పశ్చిమలో రబీ ధాన్యం అంచనాలను మించి పండింది. కొన్ని ప్రాంతాల్లో ఎకరానికి 60 బస్తాలకు పైగానే దిగుబడి వస్తోంది. కొనుగోళ్లు వేగవంతంగానే జరుగుతున్నాయి. సొమ్ములు అంతే త్వరగా రైతులు ఖాతాలో జమ అవుతున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. రైతులను కొన్ని సమస్యలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొన్నిచోట్ల లక్ష్యం పూర్తయిందంటూ ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. ఓపక్క వాతావరణంలో మార్పులు భయపెడుతున్నాయి. ఇంకొన్నిచోట్ల సంచుల సమస్య తలెత్తుతోంది. దీనిపై రైతుల్లో ఆందోళన నెలకొంది.



ఏలూరు ఇలా..

ధాన్యం ఇక కొనలేం

- ఇంకా రైతుల వద్ద లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం ఉందని అంచనా
- కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్
- మారుతున్న వాతావరణంతో బెంబేలు
- బహిరంగ మార్కెట్‌లో కొనుగోళ్లు అంతంత మాత్రమే

అంచనాలకు మించి..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రబీలో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఆరు లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 47,761 మంది రైతుల నుంచి 4.45 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతు ఖాతాల్లో రూ.980 కోట్లు జమ చేశారు. రూ.48 కోట్లు మాత్రమే బకాయి ఉంది. ఒక్కరోజు వ్యవధిలోనే ఆ సొమ్ము జమ కానుంది. ఈ విషయంలో రైతులు సంతృప్తితో ఉన్నారు. అయితే పాలకోడేరు, పెనుమంట్ర, తణుకు రూరల్ మండలాల్లో సంచుల సమస్య తలెత్తింది. ప్రధానంగా కౌలు రైతులు సంచుల కోసం ఎదురు చూస్తున్నారు. లక్ష్యానికి మించి ధాన్యం దిగుబడులు రావడంతో ఇచ్చిన సంచులు రైతులకు సరిపోవడం లేదు.

రబీలో పండిన ధాన్యం సంచుల కొరతతోనే రైతులకు ఇక్కట్లు

జిల్లా అంచనా ఇదే

జిల్లాలో ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడానికి 1,48,69,583 సంచులు అవసరం కానున్నాయని ప్రాథమికంగా అంచనా వేశారు. రైతు సేవా కేంద్రాల్లో 1,11,46,900 సంచులను సిద్ధంగా ఉంచారు. మరో 30 లక్షల సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయినా సరే సంచులకు ఇబ్బంది తప్పదంటూ రైతులు ఆందోళనతో ఉన్నారు. ఇప్పటికే రెండు, మూడు మండలాల్లో సమస్య బహిర్గతమైంది. మరో మూడు రోజుల్లో అన్ని రైతు సేవా కేంద్రాలకు అదనపు సంచులను సరఫరా చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సంచులు ఇప్పించండి మహాప్రభో

పాలకోడేరు, మే 3(ఆంధ్రజ్యోతి):ఆరుగాలం వరి పంటను పండించి కష్టించిన రైతన్నలకు గోనె సంచులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాల్లోను దాళ్వా మాసూళ్లు చురుగ్గా సాగుతున్నాయి. రాత్రయితే చాలు మబ్బులు పట్టి గాలి, దుమ్ము రావడంతో రైతులు భయపడుతూనే ధాన్యాన్ని గట్టెక్కించే పనిలో పడ్డారు. అయితే రైతులకు ధాన్యం సంచుల కొరత రావడంతో దిమ్మల మీద, రహదారుల పక్కన ధాన్యాన్ని పోగు చేస్తున్నారు. మోగల్లు, పాలకోడేరు గ్రామాల్లో ఈ కొరత ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి సంచులను సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు. మండల వ్యవసాయాధికారి నారాయణరావును 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా సంచులకు కొంత ఇబ్బందులు ఉన్నాయని, ఒకటి, రెండు రోజుల్లో మండలానికి లక్షా 40 వేల సంచులు వస్తాయని తెలిపారు.



పశ్చిమలో అలా..



రైతు సేవా కేంద్రానికి రైతులు తాళం

పెనుమంట్ర, మే 3(ఆంధ్రజ్యోతి):ధాన్యం మాసూళ్లు చేసి రోజులు గడుస్తున్నా రైతు సేవా కేంద్రంలో గోనె సంచులు ఇవ్వడం లేదని, తూకాల్లో మోసాలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో పెనుమంట్ర మండలం జుత్తిగలో రైతు సేవా కేంద్రానికి తాళం వేసి ధర్నా చేశారు. దీంతో ఘటనా స్థలానికి తహసీల్దార్ రవి కుమార్, ఏవో జోషి వచ్చి రైతులతో మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ సంచుల కోసం రైతు సేవా కేంద్రం అధికారులతో కౌలు రైతులు మాట్లాడుతుంటే సమాధానం చెప్పడం లేదని, ధాన్యాన్ని బయట అమ్ముకోవాలని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ తూకాల్లో సంచికి అదనంగా ధాన్యం తూయడం, తేమ, నూక శాతం పేరిట మిల్లర్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. జుత్తిగ గ్రామానికి చెందిన రైతులు పోతంశెట్టి సాయి రెడ్డి, ద్వారంపూడి రామిరెడ్డి, గుత్తుల నరసింహమూర్తి, వీరవల్లి రాంబాబు, తుపాకుల సోమయ్య ధాన్యాన్ని లంకలకోడేరులోని ఓ రైస్‌మిల్‌కు తీసుకుని వెళితే సంచికి అదనంగా 600 గ్రాముల చొప్పున మూడు క్వింటాల 50 కేజీలు తీసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకుని వెళితే డబ్బులు కట్టేశాక తాము ఏం చేయలేమని చెప్పడం దారుణమన్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

లక్ష్యం పూర్తయ్యిందని ఏలూరు జిల్లాలో నిలిపివేసిన అధికారులు

ఏలూరు సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలు చేయకపోతే ఎలా అని జిల్లాలోని వరి పంట పండించిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో సుమారు 80 వేల ఎకరాల్లో వరి సాగు జరగ్గా 3.54 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. దిగుబడులు అధికంగా రావడం, బహిరంగ మార్కెట్‌లో కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండడం, ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం 2.20 లక్షల మెట్రిక్ టన్నుల మాత్రమే ఉండడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రైతులు పండించిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో మిగిలిన ధాన్యం ఎవరు కొంటారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు లక్ష్యాన్ని పెంచి తమను ఆదుకోవాలంటూ రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో అమ్మడానికే మొగ్గు

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం అమ్మినా సకాలంలో ధాన్యం సొమ్ములు రాక రైతులు బహిరంగ మార్కెట్‌లోనే తమ ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకున్న పరిస్థితులు ఉన్నాయి. గత ఖరీఫ్‌లో ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం ఆ విధంగానే కొనుగోలు చేసింది. రైతులకు సకాలంలో ధాన్యం సొమ్ములు ఇచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిన 48 గంటల్లోనే ధాన్యం సొమ్ములు రావడంతో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకే అమ్మడానికి మొగ్గుచూపారు. ఈ దశలో ప్రభుత్వం లక్ష్యం పూర్తయిందని కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ళు నిలిపి వేసింది. దీంతో రైతులు మిగిలిన ధాన్యాన్ని ఎక్కడ అమ్మాలంటూ వాపోతున్నారు. రబీ సీజన్‌లో 60 శాతం మాత్రమే కొనుగోళ్ళు చేస్తామని లక్ష్యంగా నిర్దేశించుకోవటం ఏమిటని రైతులు ప్రశ్నిస్తూ రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉంగుటూరు, నిడమర్రు తదితర మండలాల్లో ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో ప్రాంతాల వారీగా వచ్చే దిగుబడులు అనుసరించి లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సి ఉండగా అన్ని ప్రాంతాల్లో ఒకే మాదిరిగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం వల్లే ఈ పరిస్థితులు ఎదురయ్యాయని రైతులు పేర్కొంటున్నారు.

భయపెడుతున్న వాతావరణం

ధాన్యం కొనుగోళ్లు పలు ప్రాంతాల్లో నిలిపి వేయడంతో కొన్ని ప్రాంతాల్లో రైతు సేవా కేంద్రాల వద్దే ధాన్యం లారీల్లోనే ఉండగా, కొన్ని ప్రాంతాల్లో కల్లాల్లోనే నిల్వ ఉందని రైతులు చెబుతున్నారు. వాతావరణ అనుకూల పరిస్థితులు వారిని ఆందోళనకు గురి చేస్తున్నాయి. సాయంత్రం అయ్యే సరికి జిల్లాలో పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోతుందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

రబీలో 3.54 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా

రబీలో ఈ ఏడాది 80 వేల ఎకరాల్లో వరి సాగు జరగ్గా 3.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. తొలుత 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించినా ఆపై లక్ష్యాన్ని 2.20 మెట్రిక్ లక్షల టన్నులకు పెంచారు. అయితే ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం కన్నా అధికంగా ధాన్యం దిగుబడులు రావడంతో రైతుల వద్ద పండించిన ధాన్యం మిగిలిపోయింది. సాధారణంగా రబీలో 45 నుంచి 50 బస్తాలు దిగుబడులు వస్తాయి. అయితే ఈ సారి 50 నుంచి 60 బస్తాల వరకు రావడంతో ధాన్యం మిగిలి పోయిందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మిగిలిన ధాన్యం ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కొనుగోళ్లు నిలిచి రైతుల ఇబ్బందులు

ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. నిర్దేశించుకున్న లక్ష్యం పూర్తయిపోయిందని కొనుగోళ్ళు నిలిపి వేశారు. రైతుసేవా కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఏం చేయాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంది. ధాన్యం ఎక్కువగా పండించే ఉంగుటూరు, నిడమర్రు , ఏలూరు, దెందులూరు ప్రాంతాల్లో ధాన్యం ఇంకా కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం లక్ష్యాన్ని పెంచాలి.

- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

సమస్యను పరిష్కరించాలి



ఆరుగాలం పండించిన రైతుకు 'టార్గెట్, 'ఈ- పంట' అంటూ వ్యవసాయ సిబ్బంది హడావుడి చేశారు. తీరా పంట చేతికొచ్చిన తర్వాత లక్ష్యం పూర్తయిందంటూ మొండిచెయ్యి చూపడం తగదు. రైతుల సమస్యను ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి.

- కొర్ని అప్పారావు, కౌలు రైతు సంఘం నాయకుడు

లక్ష్యం పేరుతో ఇబ్బందులు



గతంలో పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని ఆందోళన చెందేవాళ్లం. ప్రస్తుతం అధికంగా పంట పండడంతో దానిని లక్ష్యం పేరుతో రైతుకు కోతలు కోయడం రైతుల పరిస్థితికి అద్దం పడుతోంది.

- దుడే కేశవరావు, కౌలు రైతు

నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో రైతుల గగ్గోలు

నిడమర్రు/ఉంగుటూరు : నిడమర్రు మండలంలో పండిన ధాన్యం కొనుగోలు చేయట్లేదని రైతులు గగ్గోలు పెడుతుండగా మరో పక్క అధికారులు మా టార్గెట్ పూర్తియిందని చెబుతున్నారు. దాళ్వాలో 6,222 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు అయ్యింది. దీని ప్రకారం ప్రభుత్వం నుంచి 19,559 మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా నూరుశాతం పూర్తి చేశారు. అయితే పెదనింద్రకొలను, భువ్వనపల్లి, బావాయిపాలెం, అడవికొలను తదితర మరో సుమారు 1000 టన్నుల వరకు ధాన్యం రైతుల వద్ద ఉండిపోయింది. దీనిపై వ్యవసాయశాఖాధికారిణి గీతాదేవిని సంప్రదించగా తమకు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ నూరుశాతం పూర్తయిందని అదనంగా మరో వెయ్యి టన్నులు కొనుగోలుకు అనుమతి కోరామని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే కొనుగోలు చేస్తామన్నారు. ఉంగుటూరు మండలంలో దాళ్వా పంట విస్తారంగా పండింది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం 74 వేల మెట్రిక్ టన్నులు పూర్తవడంతో చిన్నసన్నకారు రైతాంగం సంచుల కోసం రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలో ఇంకా 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల వద్ద నిల్వ ఉందని రైతు నాయకులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత శాఖ మంత్రి ద్వారా కలెక్టర్, జేసీ దృష్టికి తీసుకువెళ్లారు.కాగా ప్రస్తుతం మూడు వేల టన్నుల ధాన్యాన్ని కొనేందుకు అంగీకరించినట్టు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. కాగుపాడు, కైకరం, చేబ్రోలు, నారాయణపురం, కాకర్లమూడి, బొమ్మిడి ఉప్పాకపాడు, రావులపర్రు గ్రామాల్లో రైతులు తమ ధాన్యం అమ్మేందుకు నిరీక్షిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు ధరను తగ్గించి రూ.80 నుంచి రూ.100ల వరకు తక్కువకు కొంటున్నారని రైతులు వాపోతున్నారు. కాగుపాడుకు చెందిన రైతులు దాసి రాజు, వైబోయిన ఆదినారాయణ తదితరులు తమ ధాన్యం అమ్మేందుకు ఆందోళన చెందుతున్నారు.

మా ధాన్యం కొనండి

కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

ఏలూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంపై కలెక్టరేట్ ముందు మండుటెండలో బైఠాయించి 'మా ధాన్యం ప్రభుత్వం కొనాలి' అంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో శనివారం అన్నదాతలు ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయ్యిందని కొనుగోళ్లు నిలిపివేయడం దారుణమన్నారు. ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం వెంటనే పెంచి రైతులు, కౌలు రైతులు వద్ద మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు బైరెడ్డి లక్ష్మణరావు, బోనగిరి కనకరాజు, తిరుమలశెట్టి జగదీశ్వరావు, ఆకిరి నాగరాజు, తోట వెంకట సత్యనారాయణ, తిరుమలశెట్టి లీలా మాధవరావు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన రైతులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్ల సమాచారం ఇవ్వండి

» డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని

ఏలూరు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని 115 ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్టుగా సమాచారం ఉంటే వెంటనే తమకు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని అన్నారు. లింగనిర్ధారణ పరీక్షలను నిషేధించే చట్టం పీసీపీఎన్‌డీటీ యాక్ట్-1994 సలహా కమిటీ జిల్లాస్థాయి సమావేశం శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగింది. కమిటీలో సభ్యత్వం వున్న న్యాయవాదులు, ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, వైద్యాధికారులు హాజరయ్యారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ చట్టాన్ని పటిష్టవంతంగా అమలు చేసేందుకు స్కానింగ్ సెంటర్లపై ఆకస్మికంగా డెకాయ్ ఆపరేషన్లను నిర్వహించడంతో పాటు, రిజిస్టర్లు, రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నదీ, లేనిదీ కంప్యూటర్ డేటాతో సహా సమగ్ర పరిశీలన చేయాలని ఆదేశించారు. లింగనిర్ధారణ నిషేధ చట్టాన్ని అమలు చేయని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు, నిర్వాహకులకు భారీ జరిమానా విధించడం, జైలుశిక్ష వంటివి నిర్మోహమాటంగా అమలు చేస్తామని వివరించారు. ఇన్‌చార్జి డెమో డాక్టర్ ప్రదీప్తి, వైద్యాధికారులు దీపక్‌కుమార్, భానుశైలజ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీతారామారావు, న్యాయవాది సత్యాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల రీ నోటిఫికేషన్‌కు స్పందన నిల్

ఏలూరు, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏలూరు మండలంలో వివిధ కారణాల రీత్యా ఏర్పాటు కానీ మూడు మద్యం దుకాణాలకు లైసెన్సులను జారీ చేయడానికి ఇటీవల జారీ చేసిన రీ నోటిఫికేషన్ వ్యాపారుల నుంచి స్పందన కనిపించలేదు. ఏలూరు రూరల్‌లో 23, 24, 26 షాపులకు మే నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడానికి ఇచ్చిన గడువు ముగియగా, ఒక్క దరఖాస్తు రాలేదు. దీంతో మరో నోటిఫికేషన్ ఇవ్వడం అనుమానమే. మిగతా జిల్లాల్లోను దరఖాస్తులు రాలేదని అధికారులు చెబుతు న్నారు. జనాభా పరంగా షాపుల విభజనతో ఇక్కడ ఆదాయం రాదనే లైసెన్సుల కోసం దరఖాస్తు చేయలేదని చెబుతున్నారు.

జిల్లాలో ఐదు ఇసుక స్టాక్ పాయింట్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

జిల్లాలో వర్షాకాలం అవసరాలకు ఇసుక నిల్వలను సిద్ధం చేసేందుకు కసరత్తులు ప్రారంభమయ్యాయి. ప్రతీ నియోజకవర్గ పరిధిలో ఇసుక స్టాక్ పాయింటు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. తూర్పు గోదావరి జిల్లాలోని తాడిపూడి ఇసుక రీచ్ నుంచి మన జిల్లాకు కేటాయించిన ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను రవాణా చేయడానికి టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేశారు. అక్కడ నుంచి నియోజకవర్గస్థాయి ఇసుక స్టాక్ పాయింట్లకు వాహనాలను కేటాయించేందుకు ఏర్పాట్లు చేయాలని రవాణాశాఖ అధికారులను ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఇసుక డిమాండ్, రుతుపవనాలు సమీస్తున్న దృష్ట్యా ఇసుక కొరత నివారించేందుకు తాజాగా చేబ్రోలు, చొదిమెళ్ల, చింతలపూడి, కైకలూరు, నూజివీడులో స్టాక్ పాయింట్లను సిద్ధం చేశారు. ఇక్కడకు తాడిపూడి నుంచి ఇసుక రవాణాకు వాహనాలను సమకూర్చేందుకు సీల్డ్ టెండర్లను ఆహ్వానించారు. వీటి గడువు శనివారం సాయంత్రంతో ముగిసింది. వీటిని సోమవారం తెరిచి, నిర్వాహకులను అప్పగించనున్నారు. ఈ నెల 15 నుంచి ఇసుక నిల్వలను తాడిపూడి నుంచి మన జిల్లాకు తరలించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.



ఇసుక తరలింపు వాహన పర్మిట్ల టెండర్ల కోసం ఏర్పాటు చేసిన బాక్సులు

వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి

స్టాక్ పాయింట్‌కు ఇసుక సరఫరా చేసేందుకు 20 నుంచి 30 జీపీఎస్ అనుసంధానం కలిగిన వాహనాలను తీసుకోనున్నారు. తద్వారా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత వాహన యజమానులతో సమావేశం నిర్వహించి ఎంపిక చేశారు. వారినే టెండర్లు కోట్ చేయడానికి సీల్డ్ టెండర్లు ఆహ్వానించారు. ప్రతీ నియోజకవర్గంలో స్టాక్ యార్డు ఏర్పాటుకు ఎండీఎల్ లైసెన్సుల జారీ చేస్తారు. స్టాక్ పాయింట్ నిర్వహణకు ప్రత్యేక విధి విధానాలను యంత్రాంగం రూపొందించింది. వేసవి అవసరాలకు డీసిల్టేషన్ పాయింట్ల నుంచి ఇసుకను వాడుతున్నారు. వాగులు, వంకల్లోనూ ప్రజలు అవసరాలకు ఉచితంగా ఎండ్లబడ్ల ద్వారా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రానున్న వర్షాకాలంలో నిల్వలు ఉంచడం వల్ల జిల్లాలోని ప్రభుత్వం, ప్రవేట్, ఇతర నిర్మాణ రంగాల అవసరాలకు 7 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకు సరిపోతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పనులు నాణ్యతగా ఉండాలి

» అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ఏలూరు, మే 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల అభివృద్ధి పనులు నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలో రూ.5కోట్ల73 లక్షలతో 52 హాస్టళ్లలో చేస్తున్న పనులపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆమె పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమశాఖ, సమగ్ర శిక్ష, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం హాస్టళ్ల తెరిచేలోగా పనులు పూర్తి చేయా లన్నారు. శిథిలావస్థలో ఉన్న ఎనిమిది సంక్షేమ వసతి గృహాల భవనాలను తొలగించి, నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి జేడీ ముక్కంటి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు : జేసీ

ఏలూరుసిటీ, మే 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ధరల నియంత్రణ కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జేసీ ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జేసీ ఛాంబర్‌లో శనివారం ఆమె అధ్యక్షతన ధరల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు కూరగాయలు, నిత్యవసరాలు ధరలు అందుబాటులో ఉండేలా పర్య వేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. డీఎస్‌వో ప్రతాప్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌బాషా, జిల్లా ఉద్యానశాఖాధికారి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నే.. సచ్చిపోతా..!

» తొలుత యనమదుర్రు డ్రెయిన్‌లో దూకితే కాపాడారు..

» ఆపై చాకుతో పీక కోసుకుని ఆత్మహత్య

భీమవరంలో మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి హల్‌చల్

భీమవరం క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి):అతని వయసు 35 ఏళ్లు. పేరు గాతల క్రాంతికుమార్. ఊరు ఉండి. భార్య, ఇద్దరు పిల్లలు. చేపల ప్యాకింగ్ పనికి వెళ్తాంటాడు. కొంతకాలంగా అతనికి ఏమైందో తెలియదు. మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. రాత్రిళ్లు మధ్యలో లేచి 'దెయ్యాలు, భూతాలు వచ్చి నన్ను చంపేస్తున్నాయి' అంటూ కేకలు వేసేవాడు. కుటుంబ సభ్యులు గాబరా పడేవారు. ఆసుపత్రులకు తీసుకుని వెళ్లి వైద్యం చేయించారు. ఒక్కోసారి బాగానే ఉన్నా.. ఒక్కోసారి పిచ్చి పిచ్చిగా మాట్లాడేవాడు. శనివారం ఉదయం చేపల ప్యాకింగ్ పనికివెళ్లాడు. పని చేస్తుండగా స్పృహ తప్పి పడిపోయాడు. తోటి పనివారు వెంటనే అతనిని ఉండి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం క్రాంతికుమార్‌ను ఉండి తీసుకు వెళుతుండగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో వాహనం దిగాడు. కుటుంబసభ్యులు తేరుకునేలోపు అతను వేగంగా వెళ్లి 'నే సచ్చిపోతా' అంటూ యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకేశాడు. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు అతనిని కాపాడి పైకి తీసుకువచ్చారు. అతను సేద తీర తున్నాడనుకునే లోపు వీరందరిని వదిలించుకుని పరిగెత్తడం ప్రారంభించాడు. అక్కడే జామకాయల అమ్మే బండి వద్దవున్న చాకు లాక్కుని మళ్లీ పరిగెత్తాడు. ఉండి రోడ్డు మల్టీప్లెక్స్ వద్దకు వెళ్లి రోడ్డుపైనే కొంతసేపు హల్‌చల్ చేశాడు. చుట్టుపక్కల జనం మూగినా అతని చేతిలో చాకు ఉండటంతో ఎవరూ అతనిని ఆపే ప్రయత్నం చేయలేకపోయారు. తర్వాత అతను ముందుగా కాలు మడాన్ని కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం అవ్వడంతో అక్కడున్న స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు చేరుకుని అతనిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా చాకుతో పీక కోసుకున్నాడు. మళ్లీ మళ్లీ పీక కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావంతో స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే క్రాంతి కుమార్ మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. పోలీసులు బంధువులకు సమాచారం అందించి మృతుడి తండ్రి గాతల జాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇజ్రాయేల్ తెలిపారు.



మృతి చెందిన క్రాంతికుమార్



2 ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం 4 మే 2025 ఆదివారం







37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... **కె. రాఘవేంద్రరావు**. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు...' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు', 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.



ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'

నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలని ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

• వినాయకరావు

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స




ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.

బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.

"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.



సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

నవ్వండి నవ్వించండి

• హాయిగా నవ్వండి.. ఆరోగ్యంగా ఉండండి



నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

నవ్వడం ఓ యోగం.. నవ్వించడం ఓ భోగం.. నవ్వలేకపోవడం ఓ రోగం.. నవ్వడం కూడా ఓ కళే అన్నారు దర్శకులు జంధ్యాల. ఒకప్పుడు నవ్వు నాలుగు విధాలా చేటు అంటే నేడు నవ్వలేకపోవడం కూడా ఆరోగ్యానికి చేటని వైద్యులు సూచిస్తున్నారు. నవ్వడం వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఆనందం, శాంతి, సౌఖ్యం వస్తుందంటున్నారు. నిజమే కదా మరి.. నేటి ఆధునిక జీవన శైలిలో ప్రతి మనిషి కాలంతో పాటు పరిగెడుతున్నాడు. రేయిబవళ్లు కష్టపడుతూ తీవ్ర మానసిక ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతున్నాడు. అటువంటి ఒత్తిడి జీవనం అధిగమించడానికి నవ్వే దివ్యమైన ఔషధంగా పనిచేస్తుంది. నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నిడమర్రు/ పాలకొల్లు/ తాడేపల్లిగూడెం రూరల్/ పోలవరం

మనకున్న కొద్దిపాటి జీవితంలో ఎవరు, ఎప్పుడు, ఎలా చనిపోతారో తెలియడం లేదు. గ్యారెంటీ లేని ఈ జీవనంలో ప్రతి ఒక్కరూ తమకున్న కొద్దిపాటి సమయంలో మానసిక ప్రశాంతతతో సంతోషంగా ఉండాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. మనస్ఫూర్తిగా నవ్వుతుంటే హైపర్‌టెన్షన్ (బీపీ) వంటి రోగాలు ధరిచేరవు. మనకొచ్చే చాలా రకాల మానసిక రుగ్మతలు, బీపీ, ఒత్తిడి, డిప్రెషన్, యాంగ్జైటీ, ఇన్సోమియా, మైగ్రేన్, తలనొప్పి వంటి సమస్యలు నవ్వడం వల్ల దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఊహ తెలియని పిల్లలు రోజుకి 300 నుంచి 400 సార్లు నవ్వుతారంటే ఆశ్చర్యం కలగక మానదు. మహిళలు 50 నుంచి 60సార్లు నవ్వుతారు. పురుషులు కనిష్ఠంగా ఎనిమిది సార్లు, గరిష్ఠంగా 20సార్లు మాత్రమే నవ్వుతారు. పౌరులందరూ రోజుకీ కనీసం 30 సార్లు నవ్వితేనే పూర్తి ఆరోగ్యంగా ఉంటారని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

లాఫింగ్ క్లబ్‌తో నవ్వులు

బహిరంగ ప్రదేశాలలో ప్రజలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని నవ్వడమే లక్ష్యంగా ఈ దినోత్సవం జరుపుకుంటారు. నవ్వుల యోగా ఉద్యమం ద్వారా 105 దేశాలలో సుమారు ఆరు వేల లాఫింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసి నవ్వుల యోగా కార్యక్రమాలు చేస్తున్నారు. ఉదయం కానీ, సాయంత్రం కానీ హాస్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కామెడీ బిట్స్, హాస్య నాటికలు, కామెడీ డైలాగ్స్ వంటివి ప్రదర్శన చేస్తారు.

నవ్వుల దినోత్సవం చరిత్ర ఇలా..

ప్రతిఒక్కరికీ నవ్వు ప్రాముఖ్యతను తెలపడం కోసం ప్రపంచవ్యాప్తంగా మేనెల తొలి ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. నవ్వు ద్వారా సోదరత్వం, స్నేహం, చైతన్యం పెంచడమే దీని ఉద్దేశ్యం. ప్రపంచ నవ్వుల దినోత్సవం మొదటిసారిగా 1998 జనవరి 10న దేశంలోని ముంబైలో జరిగింది. నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించిన డాక్టర్ మదన్ కటారియా ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సుమారు 15వేల మంది హాజరయ్యారు. విదేశాలలో తొలిసారి 2000 జనవరి 9న డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగన్‌లో నిర్వహించిన ఈ నవ్వుల దినోత్సవ కార్యక్రమానికి రికార్డుస్థాయిలో 25వేల మంది హాజరు కాగా గిన్నిస్ బుక్‌లో రికార్డయింది. జనవరిలో చలి ఎక్కువగా ఉంటుందనే హాస్య ప్రియుల కోరిక మేరకు లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ దీనిని మే మొదటి ఆదివారం జరుపుకోవడం ప్రారంభించింది.

నవ్వుతో పాజిటివ్ ఎనర్జీ

నవ్వు మనలో పాజిటివ్ ఎనర్జీ క్రియేట్ చేస్తుంది. నవ్వించే వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. మనకు ఇష్టమైన వ్యక్తులను కలిసినప్పుడు సాధారణంగానే మన పెదాలపై చిరునవ్వు సంబవిస్తుంది. ఒకప్పుడు కామెడీ సినిమాలు ప్రత్యేకంగా వచ్చేవి. నేడు వచ్చే ప్రతి సినిమాలోనూ కామెడీ ట్రాక్ నడుస్తూ సినిమా ప్రేక్షకులకు నవ్వులను అందిస్తున్నారు. నవ్వు వల్ల శరీరం డూప్‌మిన్, చెరటమిన్, ఎఢోర్పిమిన్ అనే హార్మోనులు విడుదల అవుతాయి. చివరకు హెచ్‌స్మయిల్ (దొంగ నవ్వు) వల్లనైతం శరీరంలో 10 నుంచి 12 మజిల్స్ యాక్టివవుతాయి. హాపీ హార్మోన్స్ విడుదలవుతాయి. అదే మనస్ఫూర్తిగా నవ్వితే శరీరంలో 43 మజిల్స్ యాక్టివ వుతాయి. నిత్యం హాయిగా నవ్వడం ద్వారా గుండెపోటు ప్రమాదాలు తగ్గుతాయి. అంతే కాకుండా ఎక్కువుగా నవ్వే వారు మిగిలిన వారికంటే సుమారు ఎనిమి దేళ్ల ఎక్కువ కాలం జీవిస్తారని పలు సర్వేల్లో వెల్లడైంది.

ఆయుష్షును పెంచే ఔషధం నవ్వే

నవ్వు ఆయుష్షను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. హాయిగా నవ్వుకోవడం ద్వారా మనిషిలో మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం కుదుట ఎడుతుందని తద్వారా ఆయుష్షు వృద్ధి చెందుతుంటున్నారు. ప్రశాంతంగా నవ్వుకోవడం ద్వారా హార్మోన్లు విడుదలై వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుంది. రక్త ప్రసరణ వృద్ధి చెందుతుంది. నేడు అనేక కార్పొరేట్ కంపెనీలు తమ మేనేజర్లు వృత్తి నిర్వహణలో చిరునవ్వుకు ప్రాధాన్యత ఇవ్వమని సూచిస్తున్నాయి. నవ్వుతూ పనిచేయించుకోవాలని తద్వారా మంచి ఫలితాలు వస్తాయని వ్యక్తిత్వ వికాస నిపుణులు మేనేజర్లకు తెలియజేస్తున్నారు. ప్రతి రోజూ కనీసం 15 నిమిషాల పాటు నవ్వాలని తద్వారా 40 కేలరీల శక్తి విడుదలవుతుందని, ఇది 40 నిమిషాల గాఢనిద్రతో సమానమని నిపుణులు తెలియజేస్తున్నారు. విచిత్రమేమిటంటే మన ప్రమేయం లేకుండా మనకు నవ్వు తెప్పించే వాయువు ఒకటుంది. అదే నైట్రస్‌ఆక్సైడ్ దీనినే లాఫింగ్ గ్యాస్ అని కూడా సరదాగా పిలుస్తారు.

గోదారోళ్ల వెటకారం..

గోదారోళ్ల వెటకారంతోనే నవ్వులు పువ్వులు పూయిస్తారు. గోదావరి యాసలో వెటాకారమైన మాటలతో సున్నితమైన హాస్యాన్ని పండిస్తారు. ఓరేయ్ నువ్వు చాలా గొప్పోడువిరా.., మహాగొప్పపని చేశావులే.. మంచోడువిరా... పెద్ద అమాయకుడువిరా.. అంటూ వ్యాఖ్యలతో కామెడీ పండిస్తుంటారు.

కామెడీ కింగ్స్ మనవాళ్లే..

గోదారి భాష, యాసలోనే కామెడీ ఉందనే మన రచయితలు, డైరెక్టర్లు తమ సినిమాలలో గోదావరి భాషను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ప్రఖ్యాత హాస్య దర్శకులు జంధ్యాల, ఈవీవీ సత్యనారాయణ, రేలంగి నరసింహారావు మన ప్రాంతం వారే. సినిమా ఇండస్ట్రీలో కామెడీ కింగ్స్‌గా పిలువబడే హాస్యనటులంతా గోదావరి జిల్లా వారే. నాటితరంలో హాస్యనటులు అల్లూ రామలింగయ్య, రేలంగి, రాజబాబు తెలుగు సినిమాల్లో కామెడీ పండించి నవ్వుల పువ్వులు పూయించారు. నేటితరంలో బ్రహ్మానందం, సునీల్, ఎంఎస్ నారాయణ, ఆలీ, గెటప్ శ్రీను మొదలగు వారంతా హాస్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు.

నవ్వుతో మానసిక సమస్యల పరిష్కారం



నవ్వు మన శరీరంపై సానుకూల ప్రభావం చూపెడు తుంది. హృదయనాళాల పనితీరును పెంచుతుంది. నవ్వు అనేక మానసిక సమస్యలను పరిష్కరిస్తుంది. ప్రతి ఒక్కరూ రోజూ కొంతసమయం ఆహ్లాద కరంగా గడపడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నవ్వు మనిషికి దేవుడిచ్చిన అద్భుత వరం. దాన్ని మనసారా ఆస్వాదిద్దాం.

- ఎంఎస్‌ఎల్‌ఎస్ఎస్ నారాయణ, హెచ్‌ఎం నెం.1 ప్రాథమిక పాఠశాల దర్భిపర్రు.

ధనంకంటే నవ్వే గొప్పది



ధన కనక వస్తు వాహనాలు ఎన్ని ఉన్నా కలగని తృప్తి నవ్వు వల్లే సాధ్యం. కాలిగోటి నుంచి శిరోజాల వరకూ మనుసులను ఆనందింప చేసేది ఆరోగ్యంగా ఉంచేది నవ్వు మాత్రమే. నిండు మనస్సుతో నవ్వండి నవ్వించండి.

- సారిక రామచంద్రరావు, హాస్య నటుడు

వెబ్‌సైట్‌లో ఉమ్మడి జిల్లాల టీచర్ల సీనియార్టీ జాబితా

ఏలూరు అర్బన్, మే3(ఆంధ్రజ్యోతి):పదోన్నతులు, బదిలీలకు ప్రామాణికంగా తీసుకునేందుకు రూపొందించిన పాఠశాలవిద్య పూర్వపు ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాల పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్స్ కేడర్ ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాలను శనివారం కాకినాడ ఆర్జేడీ జి.నాగమణి విడుదల చేశారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ(టిస్) ఆధారంగా ఇప్పటికే రూపొందించి విడుదలచేసి, గతనెల 22 వరకు స్వీకరించిన అభ్యంత రాలను పరిష్కరించిన అనంతరం తాజా జాబితాలను ఇప్పుడు విడుదల చేసినట్టు వివరించారు. ఈ జాబితాలను www.rjd-sekkd.org వెబ్‌సైట్‌లో పొందుపర్చడంతో పాటు, రీజియన్ పరిధిలోని ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల విద్యాశాఖల వెబ్‌సైట్లు, డీఈవో కార్యాలయాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాలపై ఎవరైనా అభ్యంతరాలు కలిగి ఉంటే ఈనెల 4వ తేదీలోగా సంబంధిత ఉమ్మడి జిల్లా డీఈవో కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. ఉపాధ్యాయుడి పూర్తి పేరు, వివరాలు, సీనియార్టీ జాబితాలో ఎక్కడ తప్పిదం జరిగిందో స్పష్టంగా పేర్కొనడంతోపాటు, ఆధారాలు కూడా జతచేయాలని కోరారు. వివరాలకు సంబంధిత జిల్లా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

10,11 తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మహాలక్ష్మీ గోపాల స్వామి కల్యాణ మండపంలో ఈనెల 10, 11 తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీకళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ తెలిపారు. శనివారం సంబంధిత పోస్టర్లను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక ద్వారా ఇప్పటికే పలు ప్రాంతాల్లో 147 శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహించి 148వ కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు పేరుతో ఏలూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొల్లి రమావతి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి శ్రీహరికోట, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కో-కన్వీనర్ ఎంజే సజయకృష్ణ, కల్యాణ మండపం అధినేత రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అవార్డుకు ట్యూటర్ అనూష



అనూషను అభినందిస్తున్న డాక్టర్ ప్రసాద్, కమిటీ సభ్యులు

ఏలూరు క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏఎన్‌ఎం, నర్సింగ్ కళాశాల ట్యూటర్‌గా పనిచేస్తున్న చిలకలపూడి అనూషకు ఉత్తమ ఉద్యోగిగా ఇండియన్ రెడ్‌క్రాస్ అందించే జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైందని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ మాగంటి ప్రసాద్ తెలిపారు. ఈ అవార్డును ఈనెల 13న రాష్ట్రపతిభవన్‌లోని కేంద్ర మంత్రి, ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ జేపీ నడ్డా చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని ఆమె అందుకోనున్నారన్నారు. ఆమె నర్సింగ్ ట్యూటర్‌గా రెడ్‌క్రాస్ సంస్థలో 14 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారని, ఎంతోమంది విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారన్నారు. ఈసందర్భంగా ఆమె ఢిల్లీ వెళ్లడానికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం రెడ్‌క్రాస్ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు పది వేల రూపాయలను బహుమతిగా అందించారు. ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో అనూషను కమిటీ సభ్యులు ఎ.నాగేశ్వరరావు, ఎంవీవీ నాగేశ్వరరావు, మేతర అజయ్‌బాబు, సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కుమారస్వామి, పలువురు అభినందించారు.

నేడే నీట్-యూజీ

- ఏలూరు జిల్లాలో ఐదు, తాడేపల్లిగూడెంలో నాలుగు పరీక్ష కేంద్రాలు
- మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు
- పటిష్ట బందోబస్తు.. ఏర్పాట్లు పూర్తి





ఏలూరులో పరీక్షా కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్

తాడేపల్లిగూడెంలో నిట్ కాలేజీని పరిశీలిస్తున్న జిల్లా ఏఎస్పీ భీమారావు

ఏలూరు క్రైం/భీమవరం రూరల్/భీమవరంక్రైం/తాడేపల్లిగూడెం రూరల్/దెందులూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆదివారం నీట్ యుజీ - 2025 పరీక్ష జరగనుంది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. ఏలూరు జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టిందని ఎస్పీ కేపీఎస్ కిశోర్ స్పష్టం చేశారు. నగరంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో పరీక్షను నిర్వహించనున్నారు. ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు తహసీల్దార్ ఎన్. శేషగిరి రావుతో కలిసి ఎస్పీ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలో ఉన్న కేంద్రీయ విద్యాలయలో 240 మంది, ఏలూరు కోటదిబ్బ వద్ద వున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 240 మంది, ఏలూరు కోటదిబ్బ కస్తూరిబా మునిసిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాలలో 360 మంది, ఏలూరు రామచంద్ర రావుపేటలోని శ్రీమతి ఈదర సుబ్బమ్మదేవి మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో 240 మంది, దెందులూరు మండలం గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 140 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ, ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

■ పశ్చిమ గోదావరి జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. తాడేపల్లిగూడెంలోని నిట్ కళాశాలలో రెండు పరీక్షా కేంద్రాలు, శశి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. నిట్‌లో మొదటి పరీక్ష కేంద్రంలో 480 మంది, మరో కేంద్రంలో 600 మంది, శశి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి కేంద్రంలో 480 మంది, మరో కేంద్రంలో 300 మంది పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా నోడల్ అధికారి జయరాం తెలిపారు. తాడేపల్లిగూడెంలోని నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాలను జిల్లా అడిషనల్ ఎస్పీ భీమారావు, డీఎస్పీ విశ్వనాథ్ పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాడేపల్లిగూడెం పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం





శ్రీవారి దర్శనార్థం క్యూలైన్లలో భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

మార్మోగిన గోవింద నామస్మరణ

ద్వారకాతిరుమల, మే 3(ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మార్మోగింది. వేసవి సెలవులు ఇవ్వడంతో పాటు స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో శనివారం భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తులతో నిండి పోయాయి. అన్ని విభాగాలు కిటకిటలాడాయి. దాదాపు 18 వేల మంది పైబడి భక్తులు స్వామిని దర్శించినట్టు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటలపైబడి సమయం పట్టింది. అనంతరం భక్తులు ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


నేటి నుంచి ముత్యాలమ్మ జాతర



మొగల్తూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే తీరప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ జాతర ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం ఉదయం జాతరకు సంబంధించి పందిరి రాట వేసి సాయంత్రం ఆలయం వద్ద ప్రత్యేక పూరిపాక వేసి అమ్మవారిని నిలబెడతారు. ఈనెల 7న అఖండ జ్యోతిని గ్రామ కరణం కుటుంబసభ్యులైన చెన్నాప్రగడ వంశస్థులు వెలిగించడంతో జాతర ప్రారంభమవుతుంది. 8 నుంచి అమ్మవారి ఆలయ పరిధి వారతిప్ప, ముత్యాలపల్లి, కొత్తోట, మోడి గ్రామాల్లో జూన్ 8 వరకు ఇంటింటికి అమ్మవారిని తీసుకువెళతారు. 9న జాతరను వైభవంగా నిర్వహించడంతో పాటు 14న ఆలయం వద్ద అఖండ అన్నసమారాధనతో జాతర ముగియనుంది. జాతరకు సంబంధించి నాలుగు గ్రామాల్లోనూ భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలం కరణలు చేయను న్నారు. ఈనెల 25 నుంచి జూన్ 8 వరకు ఆలయం వద్ద ప్రతిరోజూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడి అనుమానాస్పద మృతి



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

ఏలూరు క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): ఒక గుర్తు తెలియని యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు పవర్‌పేట గేటు బోసుబొమ్మ విగ్రహం వద్ద సుమారు ముప్పై ఏళ్ల వయస్సు గల ఒక యువకుడు మృతి చెందాడని ఏలూరు టూటౌన్ పోలీసులకు శనివారం ఉదయం సమాచారం అందింది. సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ వి.నాగేశ్వరరావు తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు వడదెబ్బ తగిలి మరణించి ఉంటాడేమోనని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడు శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో హిందీలో మాట్లాడుతూ నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మతిస్థిమితం లేని వ్యక్తిగా ఆ ప్రాంత వాసులు గుర్తించారు. తెల్లవారే సమయానికి అతడు మరణించి ఉన్నాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఫోన్ 08812-230652కు సమాచారం అందించాలన్నారు.

మహదేవపట్నంలో ఉపాధి కూలీ మృతి

ఉండి, మే3(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన ఓ వ్యక్తి అనారోగ్యానికి గురై మృతి చెందిన ఘటన ఉండి మండలం మహదేవపట్నంలో జరిగింది. వివరాలివి.. గ్రామానికి చెందిన కాల సూర్యారావు(79) ఉపాధి హామీ పథకంలో భాగంగా కాలువపూడిక తీత పనులకు శనివారం వెళ్లాడు, పనులు చేస్తుండగా అనారోగ్యానికి గురై అకస్మాత్తుగా కిందపడిపోయాడు. స్థానికులు హుటాహుటిన ఆర్‌ఎంపీని తీసుకుని వచ్చి పరిశీలింప చేయగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. పనుల వద్ద నుంచి మృతదేహాన్ని ఇంటికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న మండల టెక్నికల్ అసిస్టెంట్ ఓమెగా రాజు మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

బస్సు ప్రమాదాలు





గోపాలపురం కల్వర్టుపై తిరగబడిన బస్సు.. ప్రమాద ఘటనను విచారిస్తున్న పోలీసులు

తిరగబడిన ట్రావెల్స్ బస్సు

» ఇద్దరికి స్వల్ప గాయాలు.. తప్పిన పెను ప్రమాదం

ద్వారకాతిరుమల, మే 3(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మండలం లయన్ గోపాలపురం కల్వర్టు వద్ద హైవేపై వోల్వో బస్సు అదుపు తప్పి తిరగబడిన ఘటన జరిగింది. వివరాలివి.. శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి ఓ ట్రావెల్స్ బస్సు దాదాపు40 మంది ప్రయాణికులతో శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు వెళ్తోంది. బస్సును హైదరాబాద్ ఉడా కాలనీకి చెందిన డ్రైవర్ పప్పల ఇసాక్ నడుపుతున్నాడు. రెండో డ్రైవర్‌గా వెనుక వరంగల్ జిల్లా భైరవరానికి చెందిన పెరవల్లి రాము ఉన్నాడు. ఘటనా స్థలం వచ్చేసరికి ఓ లారీ పక్కనుంచి మీదకు దూసుకెళ్లింది. దీంతో ఈ బస్సు కల్వర్టును రాసుకుంటూ వెళ్లి బ్రిడ్జి గోడను వేగంగా ఢీకొట్టి రోడ్డుపైనే తిరగబడింది. బ్రిడ్జి గోడ దిగువన ఉన్న వాగులో బస్సు పడి ఉంటే ఘోరప్రమాదం జరిగేది. దీంతో పెను ప్రమాదం తప్పిందని పలువురు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో రెండో డ్రైవర్ రాముకు, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రులను సమీపంలోని భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బస్సు ముందుభాగం పాక్షికంగా ధ్వంసమైంది. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

» నలుగురు కార్మికులకు గాయాలు.. ఆసుపత్రికి తరలింపు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

నరసాపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం వద్ద 216 జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో నలుగురి కార్మికులు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఢీకొన్న రెండు ఆర్టీసీ బస్సులు కొనసీమ జిల్లా రాజోలు డిపోకు చెందినవి. అమరావతి పునఃనిర్మాణ సభకు తరలివచ్చిన జనాన్ని గమ్య స్థానాల్లో దించి, తిరిగి ఖాళీగా వెళుతున్న బస్సు సీతారాపురం వద్ద ఇంజన్‌లో సాంకేతిక లోపంతో ఆగిపోయింది. దీన్ని మరమ్మతు చేస్తున్న సమయంలో అమరావతి నుంచి వస్తున్న మరో బస్సు ఢీ కొట్టింది. మరమ్మతు చేస్తున్న కార్మికులకు, ఢీ కొట్టిన బస్సు డ్రైవర్ గాయాలపాలయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో జనాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని నరసాపురం డిపో అధికారులు సందర్శించారు. బస్సుల్ని డిపోకు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్ దగ్ధం



కైకలూరులో దగ్ధమవుతున్న ప్రైవేట్ స్కూల్ బస్సు

కైకలూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధమై రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. శనివారం కైకలూరు బైపాస్ రోడ్డులోని మాతా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో నిలిపి ఉన్న బస్సులో ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. పది రోజులుగా స్కూల్‌కు సెలవులు ఇవ్వడంతో బస్సులను ఖాళీ ప్రదేశంలో నిలిపారు. ఎండ వేడికి ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. తొలుత పొగ అలుముకుని ఒక్కసారి బస్సులో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులు సమాచారాన్ని అందించారు. అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్ ఘటన స్థలానికి చేరుకుని సిబ్బందితో మంటలను అదుపు చేశారు. అప్పటికే బస్సు అగ్నికి ఆహుతైంది.

గోకుల తిరుమల పారిజాత గిరిపై ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం,మే 3(ఆంధ్రజ్యోతి) : గోకుల తిరుమల పారిజాత గిరిపై కొలువైన వేంకటేశ్వర స్వామి భక్తులకు శనివారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. బుట్టాయగూడేనికి చెందిన భక్తులు గద్దే సీతా రామచంద్రరావు,గద్దే నాగభూషణం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రెడ్డి రంగప్రసాద్ భక్తులకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఈవో తెలిపారు.

ఐదవ రోజుకు వేసవి శిక్షణ శిబిరాలు

ఏలూరు టూటౌన్ : జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శనివారం 5వ రోజుకు చేరాయి. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు శిక్షణ తరగతులు పర్యవేక్షించారు. నిర్వాహకులు ఎండీ అస్లాం భాష, బీవీఎస్.లక్ష్మి, విద్యార్థులకు కథలు చెప్పారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ సుధీర్ కుమార్, పెదపాడు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్ బాబు, దెందులూరు మండలంలో సెక్టార్ సూపర్ వైజర్‌లు చిట్టెమ్మ, శ్రీదేవి, పద్మభూషణం ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు.

చిన్నపిల్లల కోసం మొబైల్ ఆధార్ నమోదు సెంటర్లు

పెదపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ మొబైల్ క్యాంపులను ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు, 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో తెలిపారు. 0-6 సంవత్సరాల పిల్లలకు కొత్త ఆధార్ నమోదు చేయించుకునేందుకు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 5, 6వ తేదీల్లో ఏపూరు, పెదపాడు, 7, 8వ తేదీల్లో అప్పనవీడు, నాయుడుగూడెం, పెదపాడు, రాజుపేట, గుడిపాడు గ్రామాల్లో, 12, 13వ తేదీల్లో కొక్కిరపాడు, వీరమ్మకుంట, 14, 15వ తేదీల్లో కలపర్రు, కొత్తూరు గ్రామాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

6వ రోజుకు చేరిన సీహెచ్‌వోల నిరసన

ఏలూరు రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) : సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని ఏలూరు జిల్లా ఏపీఎంసీఏ అధ్యక్షుడు సొంగా సిద్ధయ్య అన్నారు. కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరసన శనివారం 6వ రోజుకు చేరింది. రెండేళ్లుగా జీతభత్యాలపై వినతిపత్రాలిస్తున్నా సమస్య పరిష్కరించడం లేదని సీహెచ్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా జీతంతో పాటు ప్రోత్సాహకాలు, ఐదు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, నిలుపుదల చేసిన పీఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా కార్యదర్శి సురేంద్ర, చాందిని, విమల పాల్గొన్నారు.

సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పోలవరం, మే 3(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ శ్రీదేవి భూదేవి సమేత సుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పోలవరం, తాళ్ళపూడి, గోపాలపురం మండలాల నుంచి భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శంకరమంచి వెంకట్రామ శర్మ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వామి వారికి త్రియాహ్నిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.8వ తేదీన ఉదయం 8 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు దివ్య కల్యాణ మహోత్సవం, ఉదయం 11 గంటల నుంచి అఖండ అన్న సమారాధన, సాయంత్రం 5 గంటల నుంచి పాతపట్టిసీమలో రథం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 9వ తేదీన ఉదయం స్వామి వారికి గోదావరి చక్రస్నానం, సాయంత్రం తెప్పోత్సవం, పవళింపు సేవలు జరుగుతాయన్నారు. అలాగే పాతపోలవరం, బోడిగూడెం వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టిసీమ శివక్షేత్రం ఫెర్రీ రేవులో హుకుంపేట జమిందారు సత్రంలో పోలవరం ఎస్‌ఐ పవన్ కుమార్ తన కుమారుడు సాయిపల్లవ రామరాజ్ రుద్రాన్ష్‌కి ఉపనయనం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ర్యాలి చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతనగూడెం దత్త వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నామని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిరుద్యోగులకు డీఎస్సీ మెటీరియల్ పంపిణీ

టి.నర్సాపురం, మే 3(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ మెటీరియల్‌ను నిరుద్యోగులు వినియోగించుకోవాలని అంబేడ్కర్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకుడు జోడాల వెంకట్ ఆశాభావం వ్యక్తం చేశారు. బొర్రంపాలెంలో అంబేడ్కర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు డీఎస్సీ మెటీరియల్ శనివారం పంపిణీ చేశారు. 72 మంది నిరుద్యోగులకు 30 వేలు విలువ చేసే డీఎస్సీ మెటీరియల్ అందజేసినట్టు ఆయన తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 501 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన సూరం జగన్‌కు రూ.1500, ద్వితీయ స్థానం సాధించిన నల్లమిల్లి మమతకు రూ.1000 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గుమ్మళ్ల వెంకటేశ్వరరావు, కలపర్తి శ్రీనివాస్, రాజు, అందుగుల వెంకట్, సూర్యం పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఏలూరు టూటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్‌లను ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డీజోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు అడిషనల్ కమిషనర్ చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. అప్పలరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేసి గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి నారాయణరావు, పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

ఏలూరు రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) : ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం పెదపాడు యూనిట్ ఎన్నికలు శనివారం ఏలూరులోని జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షునిగా కె.హెచ్.వి.ఎస్.ఎస్.రవికుమార్, ఉపాధ్యక్షులుగా షేక్ అలీసాహెబ్, కార్యదర్శిగా వి.రామకృష్ణ, సహాయకార్యదర్శిగా ఎం.నళిని, ట్రెజరర్‌గా డి.జానికిరాం, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.విజయకృష్ణ, బి.హెచ్.వాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జి వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా శాఖ అధ్యక్షులు జి.శ్రీధర్‌రాజు, తదితరులు పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

ఏలూరు రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) : శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి, షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్, ఫిజికల్ డైరెక్టర్ పి.పద్మావతి తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు నవీన్ కుమార్, జాన్‌పాల్, జోష్ ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ విద్యార్థులు త్వరలో చెన్నైలో జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. షూటింగ్ బాల్‌లో ప్రతిభ కనబర్చడానికి శిక్షణ అందిస్తున్న పీడీ పద్మలతను అభినందించారు. గత నాలుగేళ్లుగా 8 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులకు శిక్షణనందిస్తూ పతకాలు సాధించేలా చేస్తున్నారు. విద్యార్థులు ఎంపికవడం పట్ల పాఠశాల సిబ్బంది ఎస్‌ఎంసీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

ఏలూరు కార్పొరేషన్, మే 3(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని, పని దినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అన్నేభవనం వద్ద జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని పాలకవర్గాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. పోరాడి సాధించుకున్న ఈ పథకాన్ని తిరిగి పోరాడి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకుగాను ఈనెల 20న ఒకరోజు దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పనులు బంద్ చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయన్నారు. 20న ఎవరూ పనులకు వెళ్లవద్దని, ఈ మేరకు గ్రామాల్లో ప్రచారం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.జీవరత్నం, ఎ.రవి, తామా ముత్యాలమ్మ, జి.వెంకట్రావు, కారం నాగదుర్గ, సక్కోటేశ్వరరావు, సాయికృష్ణ, చలపతి, ప్రభాకర్, సీత, రాజశేఖర్ పాల్గొన్నారు.

సీఆర్‌ఆర్ కళాశాలను సందర్శించిన మైక్రోసాఫ్ట్ ప్రతినిధి

ఏలూరు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని మైక్రోసాఫ్ట్‌లో ప్రిన్సిపల్ ఇంజనీరింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎన్.సీ.హెచ్.రాజేశ్‌కుమార్ శనివారం సీఆర్‌ఆర్ పీజీ కళాశాలను సందర్శించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ఎనలిస్ట్ రంగాల్లో ఉద్యోగనియామకాలకు జూన్, జూలై నెలల్లో కళాశాలలో పీజీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆయనను కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, పీజీ డైరెక్టర్ యలమర్తి బాబు, ఎంబీఏ ప్రొఫెసర్ రాజేష్, జిల్లా ఉపాధి కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

అధ్యాపకులకు ముగిసిన సామర్థ్య శిక్షణ

పెదపాడు, మే 3(ఆంధ్రజ్యోతి) :వట్లూరులోని గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న రెండవ దశ అధ్యాపకుల సామర్థ్య శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణలో పశ్చిమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కాగా, వారికి బోధనలో మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ నుంచి నందన్ కుమార్, ప్రేమలీలాకుమారి, ఏలూరు డీసీవో ఉమాకుమారి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేటలో కుంగిన సీసీ రోడ్డు



లక్ష్మీవారపుపేట, అగ్రహారంలో సరిగాలేని డ్రెయినేజీ మూతలు



డీఈవో కార్యాలయం, రామచంద్రరావుపేటలో రోడ్ల పరిస్థితి

మా గోడు వినండయ్యా..

కుంగిన సీసీ రోడ్లు, మూతలు లేకుండా డ్రెయినేజీలు
ప్రమాదాల బారిన పడుతున్నామంటూ ప్రజల ఆవేదన

ఏలూరు కార్పొరేషన్, మే 3(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఏలూరులోని సీసీరోడ్లు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారాయి. లక్షలు ఖర్చు చేసి రోడ్‌లు నిర్మించినప్పటికి వాటి ఆలనాపాలన చూడకపోవడంతో నిర్మించిన కొద్ది రోజులకే దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. రాత్రి వేళల్లో మరింత అసౌకర్యానికి గురవుతున్నామని లబోదిబోమంటున్నారు. ప్రమాదాల బారిన పడుతున్న పట్టించుకునే నాథుడేకరువయ్యాడని వాపోతున్నారు. నగరంలోని పలు సీసీ రోడ్లు దెబ్బతిన్న, కుంగినా పాలకులు, అధికారులు స్పందించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. డ్రెయినేజీలపై ఉన్న స్లాబు మూతలను తీసి పూడికలు తొలగించి తిరిగి మూతలు సరిగా వేయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఆప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పారిశుధ్యం ప్రగతిలో తిరోగమనంలో ఉందని, పరిశుభ్రత లోపించిందని దీంతో దోమల బెడద రోజురోజుకు పెరుగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. వెంకటాపురం ప్రధాన రోడ్‌లోని మురుగుకాలవ వంతెన వద్ద సీసీ రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారంది. నవాబుపేటలోని 69వ నెంబరు అంగన్‌వాడీ కేంద్ర ఉన్న రోడ్‌లో సీసీ రోడ్ కుంగిపోవడంతో పట్టించుకునే వారేలేరని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. లక్ష్మీవారపుపేటలో డ్రైనేజీ మూతలు సజావుగా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. రామచంద్రరావు పేట, డీఈవో కార్యాలయం రోడ్డు దెబ్బతినడం, అగ్రహారంలో డ్రెయినేజీపై మూతలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు పట్టించుకుని కుంగి అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని, డ్రెయినేజీపై మూతలు సక్రమంగా ఏర్పాటు చేయాలని నగర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



వెంకటాపురం మురుగు కాలవ వంతెన వద్ద సీసీ రోడ్డు

బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిదీ



సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

పెదవేగి, మే 3(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహం అనేది సమాజాన్ని పట్టి పీడిస్తున్న జాడ్యమని, దానిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు.రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పెదవేగి మండలం వంగూరులో అసంఘటిత కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఇప్పటికీ గ్రామాల్లో ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి అనర్థాలపై అవగాహన కల్పించి, అరికట్టే బాధ్యతను ప్రజలే తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధంలో బాలికా విద్య కొంతమేర దోహదపడుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. బాలికలు విద్యావంతులైతే బాల్య వివాహాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. బాలికలు విద్యకు ప్రభుత్వం కృషి చేస్తోందని, తల్లిదండ్రులు ఆడపిల్ల అనే భేదాన్ని విడనాడి తమ పిల్లల బంగారు భవిష్యత్‌కు దోహదపడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఉపయోగించుకుని ఉన్నత చదువులు చదివించాలని ఆయన సూచించారు. స్త్రీ, పురుష భేదం చూపకుండా సమాన పనికి సమాన వేతనం చెల్లించాల్సి ఉంటుందని, కార్మికులకు ఎటువంటి సమస్య ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ (15100)కు ఫోన్ చేసి తమ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు పి.రత్నరాజు, పి.వెంకటేశ్వరరావు, జి.వి.భాస్కర్, సర్పంచ్ చీలి రూతుమేరీ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

సంగీతం, నృత్యం తెలుగు వారి ఆస్తులు

ఏలూరు రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) : కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో సంగీత నృత్యోత్సవాలు ఏలూరు వైఎంహెచ్‌ఏ హాల్లో శనివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హాజరయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సంగీతం, నృత్యం తెలుగువారి ఆస్తులన్నారు. అనంతరం త్యాగరాజస్వామి జయంతి సందర్భంగా కళావేదికపై సంగీత కళాకారులు ఆలపించిన త్యాగరాజ పంచరత్న సేవ సంగీత మహోత్సవంలో ఆలపించిన గీతాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. తదుపరి అకాడమీ విద్యార్థులచే త్యాగరాజ స్వామి కీర్తనలను ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కూచిపూడి నాట్యరత్న పసుమర్తి శ్రీనివాసశర్మను సంస్థ పక్షాన సత్కరించారు. కళారత్న కెవి సత్యనారాయణ, వేణుగోపాల్ పాల్గొని మాట్లాడారు.

స్టీల్ అండ్ మెటల్ షాపుల్లో తనిఖీలు

ఏలూరు క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): మెటల్ అండ్ జనరల్ స్టోర్లలో తనిఖీలు నిర్వహించినట్టు విజిలెన్సు ఎస్‌ఐ సీతారాం, తూనికలు కొలతల అధికారి వి. రాంబాబు తెలిపారు. ఈ మేరకు అధికారులు మాట్లాడుతూ వస్తువులను ఎంఆర్పీకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. తణుకులోని పలు స్టోర్లలో శనివారం తనిఖీలు చేశారు. పూజా సామగ్రి, వాటర్ బాటిళ్లు, సీలింగ్ ఫ్యాన్లు, గ్యాస్ స్టౌ విడిభాగాలను గుర్తించి ఐదు షాపులపై కేసులు నమోదు చేశామన్నారు.

దొంగతనంపై కేసు నమోదు

భీమడోలు, మే 3 (ఆంధ్రజ్యోతి) : చెట్టున్నపాడు గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది.కొండపల్లి మధుబాబు చెట్టున్నపాడు సీఎంసీ చర్చిలో పాస్టర్‌గా పని చేస్తున్నారు. గ్రామంలోని చర్చిలో ప్రార్థనలు జరుగుతుండగా శనివారం ఉదయం ఇంటికి తాళాలు వేసి చర్చికి వెళ్లారు. ప్రార్థనలు ముగిశాక 11 గంటలకు ఇంటికి రాగా ఇంటి తలుపులు, బీరువా తెరచి ఉండడం చూశారు. ఇంట్లోని లక్షా 70 వేల రూపాయల విలువైన బంగారం చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

20న ఏఐటీయూసీ దేశ వ్యాప్త సమ్మె

ఏలూరు కార్పొరేషన్, మే 3(ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ఏఐటీయూసీ నాయకులు ఎ. అప్పలరాజు, డి.వెంకటేశ్వరరావు, బి.నారాయణరావులు శనివారం ఏలూరు నగరపాలక సంస్థ అడిషినల్ కమిషనర్ చంద్రయ్యకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20వ తేదీన దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మెలో ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ఎన్‌ఎంఆర్‌లు పాల్గొంటారని తెలిపారు. ఎన్‌ఎంఆర్‌లను రెగ్యులర్ చేయాలని, దేశ వ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరుతూ సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

దెందులూరు, మే 3(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారలకు ఆట పాటలతో విద్యను బోధించాలని ఏలూరు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ శారద అన్నారు. శనివారం మండలంలోని దెందులూరులోని అంగన్వాడీ కేంద్రాలను సెక్టార్ సూపర్ వైజర్, చిట్టమ్మలతో కలిసి పీడీ పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పాలు, గుడ్లు, బియ్యం, పౌష్టికాహారాన్ని శారద పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

కామవరపుకోట, మే 3(ఆంధ్రజ్యోతి) : వైశాఖ మాసంలోని పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయ అర్చకులు అళహరి శేషాచార్యులు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పునర్వసు నక్షత్రం రోజున ప్రతి నెలా సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధానార్చకులు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లాలో శ్రీవారి రథం

ద్వారకాతిరుమల, మే 3(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ధర్మప్రచార రథం శనివారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం రాఘవాపురానికి తరలివెళ్లింది. ముందుగా ప్రచార రథాన్ని మామిడి తోరణాలు, పూలతో సుందరంగా అలంకరించి లక్ష్మీపురం ఆలయం వద్ద ఉంచారు. ఆ తరువాత అర్చకులు కొబ్బరికాయలు కొట్టి, హారతులు సమర్పించి రథాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ రథాన్ని సాగనంపారు. ఆదివారం ఉదయం రాఘవాపురంలో చిన వెంకన్న కల్యాణం నిర్వహించనున్నారు.



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ పింఛన్ల అందజేత

ఏలూరుటూటౌన్, మే3 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చంటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడ సమస్యలు అక్కడే తిష్ట వేశాయన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకున్న ప్రజాప్రతినిధులు ఆనాడు కరువయ్యారన్నారు. నిలిచిపోయిన పనులను పది నెలలుగా పరిష్కరించామన్నారు. ఫిర్యాదు దారుల్లో ఎక్కువ శాతం పింఛన్లు, వైద్య సహాయం కోసం వస్తున్నారన్నారు. త్వరలో నూతన పింఛన్లు అందిస్తామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు వైద్యం అందిస్తున్నామన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

టి.నర్సాపురం, మే3(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని రమణ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.జకీర్‌హుస్సేన్ అన్నారు. మండలంలోని బండివారిగూడెంలో కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం రమణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు బచ్చు చినరామంజనేయులు పుట్టినరోజు సందర్భంగా సచివాలయ ఆవరణలో జకీర్ హుస్సేన్ మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి యశోద వెంకటేశ్వరరావు, సచివాలయ మహిళా పోలీసు సాయిప్రసన్న పాల్గొన్నారు.



వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

లైసెన్సు లేకుండా వాహనాలు నడపొద్దు

ఏలూరు క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు సూచించారు. ఏలూరులో శనివారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నగరంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు యువకులు, మైనర్లను గుర్తించి వారికి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. జరిగే రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఈ మేరకు మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ చేశారు. ఏలూరు రూరల్ ఎస్‌ఐ సి.హెచ్.దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో ఆశ్రం ఆసుపత్రి వద్ద వాహనాలను తనిఖీలు చేసి హెల్మెట్ ప్రాధాన్యతను తెలియజెప్పారు.



ఆంజనేయుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

మద్ది క్షేత్రంలో పంచామృతాభిషేకాలు

జంగారెడ్డిగూడెం, మే 3(ఆంధ్రజ్యోతి) : గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో ఆలయ అర్చకులు స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ఆర్.వి.చందన మాట్లాడుతూ వివిధ సేవల రూపంలో శ్రీవారి ఆలయానికి రూ.లక్షా 41వేల 401 ఆదాయం సమకూరినట్టు తెలిపారు. వేసవి నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.



మంత్రికి సమస్యలు తెలియజేస్తున్న బొరగం, తదితరులు

సమస్యలపై మంత్రికి వినతి

బుట్టాయగూడెం, మే 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా పాడేరులో సున్నపురాయి తవ్వకాలను గిరిజనులు వ్యతిరేకిస్తున్నందున పనులు నిలుపుదల చేయాలని ఆ నాయకులతో కలిసి మంత్రికి విన్నవించారు. గిరిజనులతో చర్చించిన తర్వాతనే తదుపరి పనులు చేపట్టాలన్నారు. అలాగే ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చి పరిష్కరించాలని చైర్మన్ బొరగం శ్రీనివాసులు కోరారు.



ఉపాధి కార్మికులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ఉపాధి హామీ కార్మికులతో ఎమ్మెల్యే మమేకం

పెదవేగి, మే 3(ఆంధ్రజ్యోతి) : విజయరాయిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎమ్మెల్యే ప్రభాకర్ శనివారం పరిశీలించారు. పనులు జరుగుతున్నంత సేపు అక్కడే ఉండి, కూలీలతో మాట్లాడి వారి శ్రమను కొనియాడారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్న వారికి ఆయన శీతల పానీయాలు అందించారు.ఎమ్మెల్యే ప్రభాకర్ తోపాటు టీడీపీ నాయకులు మంచినేని శ్రీనివాసరావు, దారిపోయిన సత్యనారాయణ, పెదర్ల నానీ,రావిపాటి పిచ్చియ్య చౌదరి, మన్నే శ్రీనివాసరావు, బొద్దు నరేంద్ర, పామర్తి నాగ భూషణం, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

లింగపాలెం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కోటగిరి మురళీకృష్ణ తెలిపారు. మండలంలో అన్ని రైతుసేవా కేంద్రాల్లో పిల్లిపెసర, జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామని అన్నారు. మండలంలో రైతులు ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోటగిరి మురళీకృష్ణ సూచించారు.

నేడు భగీరథ జయంతి

ఏలూరు, మే 3(ఆంధ్రజ్యోతి) : భగీరథ మహర్షి జయంతిని ఏలూరు కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు.ఈ మేరకు బీసీ సంక్షేమాధికారి ఆర్.వి.నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కొవ్వలిలో అమ్మవారి జాతర

దెందులూరు, మే 3(ఆంధ్రజ్యోతి) : కొవ్వలి గ్రామ శివారులోని పుంతల ముసలమ్మ తల్లి జాతర ఆదివార ఉదయం నుంచి పుంతలో ముసలమ్మతల్లి జాతర నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్త ఆలపాటి రామకృష్ణ తెలిపారు. ఈ జాతరకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, తపనా చౌదరి చేతుల మీదుగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రారంభిస్తారన్నారు. ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం వరకు అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

బుట్టాయగూడెం, మే3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక డీఎస్సీని ప్రకటించి గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బుట్టాయగూడెంలో ఉయికె చంద్రం అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధిక ధరలను నియంత్రించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. 1/70 చట్టం భూములకు పట్టాలు మంజూరు చేయాలని, మండల మహాసభను జయప్రదం చేయాలని మండల కన్వీనర్ చోడెం దుర్గ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మడకం దుర్గారావు, గంగ రాజు, తెల్లం మునేశ్వరరావు,వీరమ్మ పాల్గొన్నారు.

సారా విక్రయదారులకు జరిమానా

టి.నర్సాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): చింతలపూడి స్టేషన్ పరిధిలో పాత సారా కేసులో నిందితుడైన టి.నర్సాపురం మండలం కొత్తగూడేనికి చెందిన బందెల మరియదాసుకు తహసీల్దార్ రూ.3 వేల జరిమానా విధించినట్టు చింతలపూడి ఎక్సైజ్ అధికారి శనివారం తెలిపారు. మరియదాస్‌ను గతంలో తహసీల్దార్ ముందు బైండోవర్ విధించగా ఉల్లంఘించి మళ్లీ సారా కేసులో పట్టుబడటంతో జరిమానా విధించినట్టు ఎక్సైజ్ అధికారి తెలిపారు.

ఆరోగ్యంపై ఆన్‌లైన్ సదస్సు

ఉంగుటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): నారాయణపురం డిగ్రీ కళాశాలలో హెల్త్ అవేర్నెస్ ఫర్ ఆల్ సంస్థతో మెంటల్ హెల్త్ అవేర్నెస్ అనే అంశంపై ఒక రోజు ఆన్‌లైన్ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానాచార్య టి.కె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదని ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట సందీప్, కరోలినా విశ్వ విద్యాలయ సీనియర్ వైద్యాధికారి శ్రావణ్ రెడ్డి, కె.మహిజ పాల్గొన్నారు.

రెండుచోట్ల చలివేంద్రాల ఏర్పాటు


కామవరపుకోట, మే 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కామవరపుకోట పంచాయతీ ఆధ్వర్యంలో చౌతనా సెంటర్ వద్ద, కొత్తూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చలివేంద్రాలను సర్పంచ్ కరిపోతు అనూష, వైస్ సర్పంచ్ మేడూరి రంగబాబులు శనివారం ప్రారంభించారు. ఈ చలివేంద్రాల్లో మజ్జిగను కూడా పంపిణీ చేశారు. వేసవి తాపం తగ్గే వరకు చలివేంద్రాలను కొనసాగిస్తామని పంచాయతీ కార్యదర్శి వి.రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు తుమ్మలపల్లి ధనలక్ష్మి, మన్యం నాగలక్ష్మి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, సొసైటీ మాజీ చైర్మన్ సాయున కనకరాజు పాల్గొన్నారు.

వానరాలకు తాగునీరు

ద్వారకాతిరుమల, మే 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో వానరాల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ సంస్థ ముందుకొచ్చింది. ఈ క్రమంలో ఎక్కువగా వానరాలు సంచరించే జి.కొత్తపల్లి అటవీ ప్రాంతంలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన నీటి తొట్టెలను ట్యాంకర్లతో శనివారం నింపారు. అలాగే వాటికి అరటి పండ్లు అందజేశారు.

వైభవంగా వైశాఖ బ్రహ్మోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మే 3(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావు పేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 12వ తేదీ వరకు జరగనున్న 36వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం పూజా కార్యక్రమాలను ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఈనెల 9న త్రిదండి చినశ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వామి పాల్గొని మహాకుంభాభిషేకాలు నిర్వహిస్తారన్నారు. 12న ఉత్సవ మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు.



మృతిచెందిన గొర్రెలు

రోడ్డు ప్రమాదంలో 8 గొర్రెలు మృతి

ద్వారకాతిరుమల, మే 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మండలంలోని లయన్ గోపాలపురం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన దండుబోయిన కొండయ్య ఉదయం తన గొర్రెలను పొలంలో మేపుకుని సాయంత్రం ఇంటికి తోలుకెళ్తుండగా ఏలూరు నుంచి రాజమండ్రి వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో జీవాల యజమాని బోరున విలపిస్తున్నాడు.

నేడు ముసునూరులో మంత్రి పర్యటన

ముసునూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ముసునూరులో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం పర్యటించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కె. చిన సూరిబాబు తెలిపారు. నూజివీడు నియోజకవర్గ స్థాయిలో ముసునూరు జడ్పీపాఠశాలలో ఉదయం 9గంటలకు జరిగే పచ్చిరొట్ట విత్తనాలు, వివిధ రకాల వ్యవసాయ పరికరాలు పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరవుతున్నట్లు ఏవో తెలిపారు. మంత్రి చేతులు మీదుగా సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, పరికరాలను రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కలిదిండి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరేళ్ల లోపు చిన్నారుల కోసం ఈ నెల 5 నుంచి 15 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కొండలరావు తెలిపారు. 5, 6 తేదీల్లో పెదలంక సచివాలయం, 7, 8 తేదీల్లో కొండంగి సచివాలయం, 12న మట్టగుంట సచివాలయం, 13న భాస్కరరావుపేట సచివాలయం, 14, 15న కాళ్లపాలెం సచివాలయాల వద్ద ఆధార్ శిబిరాలు నిర్వహిస్తారని వివరించారు.


లూర్దుమాత ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న జోసెఫ్ రాజారావు

ఏసు క్రీస్తు లోకానికి వెలుగు
ముగిసిన లూర్దుమాత ఉత్సవాలు

మండవల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): క్రీస్తు ఏసు లోకానికి వెలుగై ఉన్నారని క్రీస్తు ద్వారా మోక్షమార్గం లభిస్తుందని విజయవాడ మేత్రాసనం తెలగతోటి జోసెఫ్ రాజారావు పేర్కొన్నారు. మండవల్లి మండలం భైరవపట్నంలో జరుగుతున్న లూర్దుమాత ఉత్సవాల్లో శనివారం సందేశాన్ని అందించారు. సత్యాన్ని, ధర్మాన్ని, సేవను జాలిని తమ పొరుగువారితో పంచుకోవాలని కోరారు. చీకటిని పారదోలడానికి క్రీస్తు అనే వెలుగును మనుసులో పెట్టుకోవాలని వివరించారు. అంతకుముందు ఫాదర్‌ను భైరవపట్నం ప్రదర్శన సెంటర్ నుంచి భారీ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఉత్సవాలు ముగింపుతో భారీ ఎత్తున టపాసులు వెలిగించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇందులో భైరవపట్నం విచారణ గురువు శాంతరాజు ఆయా సంఘాల కాపరులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయ్యాలని వినతి

చాట్రాయి, మే 3(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయ్యాలని కోరుతూ ఎంపీఈవో విజయ లక్ష్మికి శనివారం వృత్తిదారుల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.అనూష, వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి పుల్లారావు వినతిపత్రం అందజేశారు. ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కుటుంబానికి కాకుండా ప్రతి కూలీకి ఇవ్వాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, కనీస వేతనం రోజుకు రూ.700 ఇవ్వాలని, 60 సంవత్సరాలు దాటిన వారు కుటుంబంలో ఎంత మంది ఉన్నా నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కొత్త హైస్కూల్‌లో ప్రవేశాలకు ప్రచారం

ముదినేపల్లి, మే 3 (ఆంధ్ర జ్యోతి): ముదినే పల్లి మండలం వైవాక గ్రామం లో 2025 -26 విద్యాసంవత్సరం నుంచి కొత్తగా ప్రారంభం కానున్న జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులను చేర్పించేందుకు స్కూల్ అధ్యాపకులు కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. హైస్కూల్ హెచ్‌ఎం వర్రే శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు యశోద కృష్ణ, ఏసుబాబు, వైవాక యూపీ స్కూల్‌లో 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను కొత్తగా అప్ గ్రేడ్ అయిన హైస్కూల్‌లోనే 9వ తరగతిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు.

పూర్వ విద్యార్థులు ప్రింటర్ అందజేత



ఆగిరిపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి):పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రింటర్‌ను బహూకరణ చేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత తెలిపారు. స్థానిక మండలం లోని ఆగిరిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమ పాఠశాలకు ప్రింటర్‌ను అందజేశారు. 2005-06 పూర్వ విద్యార్థులు రూ25వేలు వెచ్చించి పాఠశాలకు ప్రింటర్‌ను అందించారు.

విద్యార్థులు యోగ, ధ్యానం అలవర్చుకోవాలి



కలిదిండి మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు యోగ, ధ్యానం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి రాఘవులు అన్నారు. శనివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కోరుకొల్లు గ్రంథాలయంలో విద్యార్థులచే యోగా, ధ్యానం చేయించారు. జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివించారు. ప్రతి రోజూ యోగ, ధ్యానం చేయటం వల్ల శ్వాస సజావుగా సాగుతుందన్నారు.

భారీగా పెరిగిన జగన్నాథస్వామి చెరువుల లీజు


చెరువుల లీజు వేలం నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసరావు

ముదినేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలిలోని శ్రీసుభద్ర దేవస్థానానికి చెందిన పెయ్యేరులోని చేపల చేపల చెరువులను మూడు సంవత్సరాల కాలపరిమితికి లీజుకు ఇచ్చేందుకు శనివారం దేవస్థానం అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో దేవస్థానం ఆదాయం గణనీయంగా పెరిగింది. పెయ్యేరులోని 10.56 ఎకరాల విస్తీర్ణంలోని చేపల చెరువుల్లో చేపలు పెంచుకునేందుకు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు మూడు సంవత్సరాలకు వేలం నిర్వహించగా ఏడాదికి రూ.7.28 లక్షలు లీజుకు రైతు హనుమార పేర్నీడు పాడుకున్నారు. దీంతో మూడు సంవత్సరాలకు ఈ దేవస్థానానికి రూ.22లక్షలు ఆదాయం వస్తుందని ఈవో తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో ఈ లీజు ఆదాయం కేవలం రూ. 13.71 లక్షలు మాత్రమే ఉన్నది.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

కైకలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం వరహాపట్నంలో సీఎం సహాయ నిధి రూ.7,33,535 విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ శనివారం రోగులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, బీసీ సంఘ నాయకుడు గంగునేని వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు షెల్టర్ లేదు!

చాట్రాయిలో బస్ షెల్టర్ లేక అవస్థలు


చాట్రాయి సెంటర్‌లో రోడ్డుపైనే బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కిస్తున్న దృశ్యం

చాట్రాయి, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చాట్రాయిలో బస్‌షెల్టర్ లేకపోవటంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నారు. చాట్రాయి 10 గ్రామాలకు కూడలి కావటంతో ఇక్కడి నుంచి ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు పక్కన, షాపుల ముందు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఎదురుచూడవలసిన పరిస్థితి ఉంది. ఈ రూటులో హైదరాబాద్, వైజాగ్, విజయవాడ, నూజివీడు, చింతలపూడి, తిరువూరు, చీపురుగూడెం, జనార్ధనవరంలకు నిత్యం 40పైగా ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. ఏలూరు- ఎన్టీఆర్ జిల్లాల రహదారిలో చాట్రాయి ఉండటం వలన వాహనాల రద్దీ విపరీతంగా ఉంటున్నది. దీనికి తోడు చాట్రాయి సెంటర్ ఇరుకుగా ఉంటుంది. ఆర్టీసీ బస్సులు రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించటం. దించటం చేస్తున్నారు. బస్సు ఆగిన సమయంలో ట్రాఫిక్ నిలిచిపోవటమే కాక ప్రయాణికులు పక్క నుంచి ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, చిన్నకార్లు వేగంగా దూసుకుపోతున్నాయి. మహిళలు పిల్లలు వృద్ధులు బస్సులు ఎక్కటానికి దిగటానికి భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుందో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. 1986లో ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు చాట్రాయి బస్టాండ్ మంజూరైంది. బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన 50 సెంట్లు స్థలాన్ని స్థానిక నాయకులు చూపించలేకపోవటంతో నిధులు వెనక్కి వెళ్ళాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికులు కనీసం కూర్చోటానికి బస్‌షెల్టర్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోవాలి



చాట్రాయి సెంటర్‌లో బస్సులు ఎక్కటం దిగటం ప్రమాదకరంగా ఉంది. అవకాశం లేక బస్సులు రోడ్డుపైనే ఆపుతుండటం వలన ప్రయాణికులు బస్సులు ఎక్కటం దిగటం ప్రమాదకరంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి కనీసం బస్‌షెల్టర్ అయినా నిర్మించాలి

- గోళ్ళ విశ్వేశ్వరరావు, చాట్రాయి

సార్వాలో కాలువల ప్రక్షాళన చేస్తాం: ఎమ్మెల్యే కామినేని


దేవపూడి వద్ద పెదలంక మేజర్ డ్రెయిన్‌లో పంటుపై ఎక్కి కిక్కిస తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, తూర్పు డెల్టాలో ఇరిగేషన్ డ్రెయినేజీ వ్యవస్థలను ఆధునీకరించడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. ముదినేపల్లి మండలం పెదలంక మేజర్ డ్రెయిన్‌లో దేవపూడి వద్ద, పూటుకూరు మీడియం డ్రెయిన్‌లో పూటుకూరు వద్ద ఎక్స్‌వేటర్‌తో కిక్కిస తొలగింపు పనులను ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ పనులకు తాను ఏర్పాటు చేసిన పంటుపై ఎక్కి పనులు జరుగుతున్న తీరును చూశారు. ఈ సందర్భంగా డాక్టర్ కామినేని మాట్లాడుతూ వచ్చేసార్వా సీజన్ నాటికి డ్రెయిన్లు, పంట కాల్వల్లో నీటి ప్రవాహాలకు ఉన్న ఆటంకాలు తొలగించేందుకు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారని, పూడికతీత పనులకు మరో రూ.5 కోట్లు నిధుల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, డ్రెయినేజీ ఈఈ కిరణ్‌బాబు, డీసీ చైర్మన్లు గుడిసేవ సురేష్, తాడినాడబాబు, నల్లగోపుల చలపతి, కొల్లి వీర ప్రసాద్, వాసురాజు, నీటి సంఘం అధ్యక్షుడు పోసినపాండు రంగారావు, తదితరులు పాల్గొన్నారు.



చింతలవల్లిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు.. చాట్రాయిలో కిశోర బాలికలకు శిక్షణ

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

చాట్రాయి, మే 3(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలలో భాగంగా చాట్రాయి అంగన్వాడీ కేంద్రంలో శనివారం కిశోర బాలికలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వలన అనర్థాలు, ఆరోగ్యం, పోషకాహారం, విద్యా, నైపుణ్యాలు మొదలైన అంశాలపై శిక్షణ ఇచ్చారు. వారానికి రెండు రోజులు చొప్పున జూన్ 10వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు జరుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు: కిషోర్ బాలికల వికాసానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి అన్నారు. శనివారం చింతలవల్లిలో జరిగిన కిశోర వికాసం కార్యక్రమంలో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై బాలికలకు అవగాహన కల్పించారు. 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయస్సు గల కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని, పరిపక్వత లేని బాలికలకు వివాహం చేసే సాహసాన్ని తల్లిదండ్రులు చేయవద్దని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీలు వివరించారు. బాలికల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చోరీలతో రైతుల బేజారు

బాధిత రైతుల ఆక్రోశం - ఆగని రాగి వైర్లు చోరీ

పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన


వేల్పుచర్లలో వ్యవసాయ బోరు వద్ద కేబుల్ కట్ చేసిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) రమణక్కపేటలో స్టార్టర్ పెట్టెలో ఫీజులు పగులకొట్టిన దృశ్యం

ముసునూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లుకు సంబంధించిన సామగ్రిలో రాగి వైర్లు చోరీలు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రి సమయాల్లో కేబుల్ వైర్, స్టార్టర్, ఫ్యూజుల్లోని రాగివైర్‌ను దుండగులు చోరీ చేస్తుండటంతో ప్రతి రైతు రూ.10వేలు నుంచి 15వేలు వరకు నష్టపోతున్నాడు. తాజాగా రమణక్కపేటలో ముగ్గురు రైతుల వ్యవసాయ బోర్లు నుంచి కేబుల్, ఇతర సామగ్రిలో రాగివైర్‌ను దొంగిలించుకుపోయారు. సుమారు వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని, ఈ చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. ఇటీవల ముసునూరు, గోపవరం, పెద్దపాటివారిగూడెం, వేల్పుచర్ల, కొర్లకుంట, తాళ్ళవల్లి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో నెల రోజుల కాల వ్యవధిలోనే ఒక్కొక్క గ్రామంలో 20 నుంచి 30 బోర్ల సామగ్రి చోరీ అయ్యాయి. అలాగే కొత్తగా పంట పొలాల్లో ఉన్న బిందు సేద్యంకు సంబంధించిన సామగ్రి సైతం చోరీకి గురవుతు న్నాయి. ఒకవైపు బోర్లు సామగ్రి, మరొకవైపు డ్రిప్ పరికరాలు చోరీ చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అరకొరగా పండుతున్న పంటలతో ఇబ్బందులు పడుతుండగా, కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈ చోరీలతో ఆర్థికంగా నష్టపోతున్నా మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధి కారులు నిఘాపెట్టి చోరీలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ముసునూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి గడ్డి మందు తాగి మృతి చెందాడు. ఈ ఘటనపై ముసునూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామశివారు వజ్రంపాడుకు చెందిన మరీదు రాంబాబు(38) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్ళిన రాంబాబుకు తట్టుకోలేని కడుపునొప్పి రావడంతో పొలంలో ఉన్న గడ్డిమందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాంబాబు మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నీతి కథల బోధన

ముదినేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు నీతి కథలను చదివించటంతోపాటు తెలుగు ఎక్కా లను చెప్పించే కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథాలయాధి కారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. నీతి కథలను బోధించి గ్రంథాలయాధికారిణి విద్యార్థులకు కథల్లోని సారాంశాల ను వివరించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఆగిరిపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపటం, హెల్మెట్ లేకుండా వాహనం నడపటం, మద్యం సేవించి వాహనం నడపటం వంటి వాటి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇలాంటి చర్య పునరావృతం అయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై శుభశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


కోరుకొల్లు రామాలయంలో ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలు

వైభవంగా రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

కలిదిండి మే 3 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు యాదవపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల, లక్ష్మణ, ఆంజనేయ, శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 5 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చెన్నంశెట్టి మురళీకృష్ణ, నియోజకవర్గ టీడీపీ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం, నీటి సంఘం అధ్యక్షుడు కేశిరెడ్డి బలరామ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ


గురజ సీతారామాలయం వద్ద పూజలు

ముదినేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో పునర్నిర్మించిన సీతారామ ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఇందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా శనివారం విగ్రహాల క్షీరాధివాసం, జలాధివాసం, ఇతర పూజా కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పేర్నీ గిరి ఆధ్వర్యంలో అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివా సాచార్యులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విగ్రహాల ప్రతిష్ఠతోపాటు, ఆలయ శిఖర ప్రతిష్ఠ, శాంతి కల్యాణం నిర్వహించిన అనంతరం అన్నసమారాధన జరుగుతుంది.


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు

నూజివీడు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మార్‌అప్పారావు పీజీ సెంటర్లో ఫేర్‌వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కామర్స్, మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఫేర్‌వెల్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.నవీనలావణ్యలతను విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో అమూల్యమైనదని, ఈ అమూల్యమైన క్షణాలు ఎన్నటికి తిరిగి రావన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు షేక్ అన్వర్‌బాషా, కె.ప్రభాకర్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కు చేసిన స్కూల్ బస్ దగ్ధం


బస్సులో నుంచి ఎగిసిపడుతున్న మంటలు

కైకలూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధమై రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. శనివారం కైకలూరు బైపాస్ రోడ్డులోని మాతా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో నిలిపి ఉన్న బస్సులో ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. 10 రోజులుగా స్కూల్‌కు సెలవులు ఇవ్వడంతో బస్సులను ఖాళీ ప్రదేశంలో నిలిపారు. ఎండ వేడికి ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. ముందుగా దట్టమై పొగలు అలుముకుని ఒక్కసారి బస్సులో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులు సమాచారాన్ని అందించారు. దీంతో అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని సిబ్బందితో మంటలను అదుపు చేశారు. అప్పటికే బస్సు అగ్నికి ఆహుతైంది.